

రేపటి నుంచి ఇంటర్ కాలేజీలు ఓపెన్

సంగారెడ్డి అర్బన్, మే 31 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ జూనియర్ కాలేజీలు వేసవి సెలవుల అనంతరం రేపటి నుంచి తిరిగి తెరుచుకోనున్నాయి. మార్చి 19న ఇంటర్ మొదటి సంవత్సరం, 20న రెండో సంవత్సరం పరీక్షలు ముగిసిన వెంటనే ఇంటర్ విద్యార్థులకు సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. వేసవి సెలవులు నేటితో ముగియనున్నాయి. కాలేజీలు తిరిగి తెరుచుకోనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

రోటరీ క్లబ్ ఉచిత వైద్య సేవలు మరువలేనివి

టీజీఐఐసీ చైర్‌పర్సన్ తూర్పు నిర్మలాజగ్గారెడ్డి

సదాశివపేట, మే 31 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ అందజేస్తున్న ఉచిత వైద్య సేవలు అభినందనీయమని టీజీఐఐసీ చైర్‌పర్సన్ తూర్పు నిర్మలాజగ్గారెడ్డి పేర్కొన్నారు. సదాశివపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంప్‌లో టీజీఐఐసీ చైర్‌పర్సన్ తూర్పు నిర్మలాజగ్గారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజల కోసం రోటరీ క్లబ్ ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలు సమాజంలో మానవత్వం, నిజాయితీని నిలబెడతాయన్నారు. వైద్యుల్లో రోగుల ప్రాణాలను కాపాడే తపన ఉండాలన్నారు. అనంతరం రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ఓదెల ప్రభు గుప్తా, సెక్రెటరీ అశోక్ కుమార్ బుస్సా, కోశాధికారి వేణు, క్లబ్ సభ్యులు మాట్లాడుతూ రొమ్ము, గర్భాశయ క్యాన్సర్, డయాబెటిస్, బీపీ, జనరల్ హెల్త్, కార్డియాలజిస్టు టెస్టులకు సంబంధించి వందలాది మందికి ఉచితంగా వైద్యం, మందులను అందించామని తెలిపారు. క్యాంప్‌లో పాల్గొన్న వారందరికీ ఓదెల ఈశ్వరయ్య ఫౌండేషన్ తరఫున భోజన సదుపాయం కల్పించినట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రజలకు మరిన్ని మెరుగైన, నాణ్యమైన, ఖరీదైన వైద్య సేవలు అందిస్తామని రోటరీ క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ గడీల రాంరెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ, సదాశివపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ గుప్తా, రోటరీ క్లబ్ సభ్యులు పురం రజనీ, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





రోటరీ క్లబ్ ఉచిత వైద్య శిబిరంలో మాట్లాడుతున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ తూర్పు నిర్మలాజగ్గారెడ్డి, రోటరీ క్లబ్ సభ్యులతో నిర్మలాజగ్గారెడ్డి

మహిళలకు మంత్రి పదవులు ఇవ్వనప్పుడు
కవిత ఎందుకు మాట్లాడలే? 7



అమీన్‌పూర్‌లో కూల్చివేస్తున్న అక్రమ కట్టడాలు

అమీన్‌పూర్‌లో కొనసాగుతున్న కూల్చివేతలు

నర్రెగూడెం సర్వే నంబర్ 1112లో, సుల్తాన్‌పూర్ భూదాన్ భూముల్లో అక్రమ నిర్మాణాలు నేలమట్టం

అమీన్‌పూర్, మే 31 (ఆంధ్రజ్యోతి): అమీన్‌పూర్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేతలు రెండో రోజు కొనసాగాయి. పట్టణ పరిధిలోని నర్రెగూడెంలో సర్వే నంబర్ 1112లోని ప్రభుత్వ భూమిలో వెలసిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ సిబ్బంది పోలీసు బందోబస్తు మధ్య నేలమట్టం చేశారు. నర్రెగూడెం రాజీవ్ స్వగృహ కాలనీ పక్కనే విస్తరించిన ఉన్న ప్రభుత్వ భూముల్లో దశాబ్దాల క్రితం ఇచ్చిన ఇళ్ల పట్టాలను అడ్డంపెట్టుకుని చేస్తున్న ఆక్రమణలను గుర్తించి కూల్చివేశామని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రఘువర్ధన్ రెడ్డి తెలిపారు. మరోవైపు మున్సిపాలిటీ పరిధిలోని సుల్తాన్‌పూర్ గ్రామ శివారులో భూదాన్ భూముల్లో అక్రమంగా నిర్మించిన ఇళ్లను కూల్చివేశారు. బూధాన్ ట్రస్ట్‌ఆధీనంలో ఉన్న సర్వేనెంబర్ 457బై2లో రేకుల ఇండ్లను, బేస్‌మిట్లను తొలగించారు. ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

వైద్యులు ఫుల్.. రోగులు నిల్

సకల సౌకర్యాలున్న ఆస్పత్రికి రోగులు కరువయ్యారు. వంద పడకల సామర్థ్యం ఉన్నా.. ముప్పై పడకలు కూడా నిండటం లేదు. పన్నెండు విభాగాల్లో సేవలు అందుబాటులో ఉన్నా 60 మంది ఔట్‌పేషెంట్లు కూడా రావడం లేదు. 40 మంది డాక్టర్లు.. 80 మంది నర్సులు.. 70 మంది పారామెడికల్ సిబ్బంది ఉన్నా కేసులన్నీ హైదరాబాద్‌లోని పెద్దాస్పత్రులకే రిఫర్ చేస్తున్నారు. దీంతో, రామచంద్రాపురంలో ఈఎస్ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేసిన లక్ష్యం నీరుగారుతున్నది.



- పేరుకే 100 పడకల దవాఖానా
- 40 మంది డాక్టర్లు.. 80 మంది నర్సులు..
- 70 మంది పారామెడికల్ సిబ్బంది
- పన్నెండు విభాగాల్లో 60 మించని ఓపీ
- 30 పడకల్లోనే ఇన్‌పేషెంట్లు
- కేసులన్నీ పై ఆస్పత్రికే రిఫర్
- వేధిస్తున్న మందుల కొరత
- రామచంద్రాపురం ఈఎస్ఐ ఆస్పత్రి పరిధిలో 15 డిస్పెన్సరీలు

రామచంద్రాపురం ఈఎస్ఐ ఆస్పత్రికి గ్రహణం

రామచంద్రాపురం టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు నియోజకవర్గం పారిశ్రామికవాడలకు కేంద్రం. మూడు వేలకు పైగా చిన్నాపెద్ద కంపెనీలు ఇక్కడ ఉన్నాయి. స్థానికులతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన లక్ష మంది కార్మికులు పనిచేస్తుంటారు. వీరందరికీ మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా రామచంద్రాపురంలో ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు చేశారు. రూ.21వేల లోపు వేతనం పొందుతున్న ప్రతీ ఒక్కరు



ఈఎస్ఐలో వైద్యసేవలు పొందడానికి అర్హులు. కార్మికులకు అధునాతన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా రామచంద్రాపురంలో 50 పడకల సామర్థ్యంతో ఈఎస్ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. అనంతరం వంద పడకలకు పెంచారు. రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటంతో 200 పడకలకు పెంచడానికి సిద్ధమయ్యారు. ఇంతలోనే ఏడేళ్ల క్రితం ఎర్రగడ్డలోని ఈఎస్ఐ ఆసుపత్రిని సూపర్‌స్పెషాలిటీగా అప్‌గ్రేడ్ చేశారు. దీనికితోడు నగరంలో 40 ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ ఈఎస్ఐ వైద్యసేవలు పొందడానికి సర్కారు అవకాశం కల్పించింది. రామచంద్రాపురం ఈఎస్ఐ ఆస్పత్రి పరిధిలో 15 డిస్పెన్సరీలు ఉన్నాయి. అయితే, ఇటీవల ఈ డిస్పెన్సరీలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అవసరమైనప్పుడు స్థానికంగా ఉన్న వంద పడకల ఆస్పత్రికి రిఫర్ చేయకుండా ఎర్రగడ్డలోని సూపర్‌స్పెషాలిటీ దావాఖానాకు

మిగతా 8వ పేజీలో



అన్నీ గుమ్మం వద్దకే..

- ఒక్క క్లిక్‌తో ఇంటి నుంచే ఆన్‌లైన్ షాపింగ్
- అరచేతిలోనే మార్కెట్ సమాచారం
- జిల్లాలో విస్తరిస్తున్న ఈ కామర్స్ సేల్స్
- నిత్యావసర వస్తువులు, తినుబండారాలు సైతం ఆర్డర్
- ప్రతీ రోజు లక్షల్లో వ్యాపారం.. యువతకు ఉపాధి



7

2008-డీఎస్సీ టీచర్లకు వారంలో వేతనాలు

ఫైల్‌కు ఆర్థికశాఖ ఆమోదం

సంగారెడ్డి జిల్లాలో 67 మంది కాంట్రాక్ట్ టీచర్లు

సంగారెడ్డి అర్బన్, మే 31 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ప్రత్యేక ఉత్తర్వులతో కాంట్రాక్ట్ టీచర్లుగా నియమించబడిన డీఎస్సీ 2008 అభ్యర్థులకు వారంలో వేతనాలు అందుతాయని సంబంధిత అధికారులు తెలిపారు. వేతనాలకు సంబంధించిన ఫైలుకు శుక్రవారం రాత్రి ఆర్థికశాఖ ఆమోదం లభించిందని విద్యాశాఖ అధికారులు తెలిపారు. కాంట్రాక్టు టీచర్లకు వేతనాల అందకపోవడంపై 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 25న 'నాలుగు నెలలుగా వేతనాల్లేవ్' అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. వేతనాల విడుదలకు సంబంధించిన ఫైల్‌కు ఒకట్రెండు రోజుల్లో విద్యాశాఖ ఆమోదం తెలపనున్నదని అధికారులు పేర్కొంటున్నారు. వారంలో నాలుగు నెలల వేతనాల మంజూరయ్యే అవకాశం ఉందని వారు తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో 67 మంది కాంట్రాక్ట్ టీచర్లు పనిచేస్తున్నారు.



మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఎంపీ, ఐజీ, కలెక్టర్

మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సేవలు అభినందనీయం

- ఉద్యోగ విరమణ సభలో ఎంపీ రఘునందన్‌రావు
- హాజరైన ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, కలెక్టర్ రాహుల్‌రాజ్, మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు

మెదక్ అర్బన్, మే 31: ప్రజలకు, పోలీసు వ్యవస్థకు మెదక్‌ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అందించిన సేవలు అభినందనీయమని ఎంపీ రఘునందన్‌రావు కొనియాడారు. శనివారం ఉద్యోగ విమరణ పొందుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డికి మెదక్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసి సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రిటైర్మెంట్ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని ఆశించారు. ఐజీ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ. పోలీసుశాఖలో ఎంతో ఒత్తిడితో కూడిన విధులు నిర్వహించి, ఎలాంటి రిమార్కు లేకుండా పదవీ విరమణ చేయడం గొప్ప విషయమన్నారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ ఎస్పీ జిల్లాలోని అధికారులందరితో స్నేహంగా ఉంటూనే క్రమశిక్షణతో విధులు నిర్వహించేలా పర్యవేక్షించారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు మాట్లాడుతూ ఎస్పీ సేవలు భవిష్యత్‌లో వచ్చే అధికారులకు మార్గదర్శకంగా నిలుస్తాయన్నారు. అనంతరం ఎస్పీ దంపతులను అలంకరించిన వాహనంలో కూర్చోబెట్టి అదనపు ఎస్పీ, డీఎస్పీ, పోలీసు అధికారులు లాగుతూ ఘనంగా వీడ్కోలు పలికారు.

నాలుగు ఆస్పత్రుల సూపరింటెండెంట్లకు షోకాజ్

రోగులకు అందజేసే ఆహారంపై నిర్లక్ష్యం

విజిలెన్స్ నివేదిక మేరకు సర్కారు చర్యలు

సంగారెడ్డి అర్బన్, మే 31(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో నాలుగు ప్రభుత్వ ఆస్పత్రుల సూపరింటెండెంట్లకు వైద్య ఆరోగ్యశాఖ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఆస్పత్రుల్లో రోగుల భోజనం అందించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని, మెనూ పాటించడం లేదని, ఆహార పదార్థాల తయారీలో నాణ్యత, పరిశుభ్రత పాటించడం లేదంటూ ఫిర్యాదులు రావడంతో ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. విజిలెన్స్ ఇచ్చిన నివేదిక మేరకు తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని(టీవీవీపీ) జహీరాబాద్, నారాయణఖేడ్, పటాన్‌చెరు, జోగిపేట ఏరియా ఆస్పత్రుల సూపరింటెండెంట్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు వైద్యశాఖ వర్గాలు తెలిపాయి. సంబంధిత ఆస్పత్రుల డైట్ కాంట్రాక్టర్లను తొలగించి, ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఆదేశించినట్లు సమాచారం.



సమీక్షా సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, దామోదర్ రాజనర్సింహ

వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం

- ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ
- సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి : వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

సంగారెడ్డి రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి) : తమ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇస్తున్నదని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో శనివారం ఉమ్మడి మెదక్ జిల్లా కలెక్టర్లు, అధికారులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలతో మంత్రులు కొండా సురేఖ, దామోదర్ రాజనర్సింహ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలోనే ధాన్యం పండించడంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉన్నదని పేర్కొన్నారు. సన్నాలకు బోనస్ ఇవ్వడంతో రైతులు ప్రయోజనం పొందుతున్నారని తెలిపారు. కలెక్టర్లే రైతులను నేరుగా కలిసి సమస్యలను తెలుసుకుంటున్నారన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 95 శాతం ధాన్యం సేకరణ పూర్తయిందన్నారు. అకాల వర్షంతో తడిసి ధాన్యాన్ని కూడా కొంటామని భరోసా ఇచ్చారు. అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని చెప్పారు. ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని, అవసరమైతే మరో 20 శాతం కేటాయిస్తామని తెలిపారు.

వానాకాలం వైద్యశాఖ అప్రమత్తం

వానాకాలం వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, చెత్త, మురుగు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. రైతుల సమస్యలను తీర్చడానికే భూ భారతి చట్టం తీసుకువచ్చామని మంత్రి వెల్లడించారు. కొత్త చట్టంతో రైతులు కార్యాలయాలు, కోర్టుల చుట్టు తిరిగే శ్రమ తప్పిందని ఆయన పేర్కొన్నారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి

మిగతా 8వ పేజీలో

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, మే 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను రేపు జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉదయం 9:30 గంటలకు జాతీయ జెండాను ఎగురవేయాలని సూచించారు. పొరపాట్లకు అస్కారం ఇవ్వకుండా తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. కలెక్టరేట్‌లో జరిగే వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు పేర్కొన్నారు. అలాగే, జిల్లావ్యాప్తంగా జూన్ 3 నుంచి భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



ప్రమాదం.. పక్కనే!

ఇటీవల గాలివానకు నర్సాపూర్ మండలంలోని చిన్న చింతకుంట, రుస్తుంపేటలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు కూలిపోయాయి. వైర్లు వేలాడుతున్నాయి. ప్రమాదం పొంచిఉన్నదని తెలిసినా విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేయడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇదేమంటే సామగ్రి కొనుగోలు చేసుకుని వస్తే మరమ్మతు చేస్తామంటూ నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారని వాపోతున్నారు.

-నర్సాపూర్, మే 31 (ఆంధ్రజ్యోతి)





పొదల్లో నవజాత శిశువు మృతదేహం

పటాన్‌చెరు, మే 31 (ఆంధ్రజ్యోతి) : కళ్లు తెరవకముందే రాళ్లమధ్య పొదల్లో ఓ నవజాత శిశువు ప్రాణాలు కోల్పోయి లభ్యమైన హృదయ విధారక సంఘటన సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధి లోని ఇంద్రేశం గ్రామంలో చోటుచేసుకుంది. ఇంద్రేశం గ్రామశివారు లోని గుప్తహిల్స్ కాలనీలో శనివారం ఉదయం నవజాత శిశువు మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృత ఆడ శిశువుకు పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. శిశువు మృతికి కారకులను గుర్తించేం దుకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం శిశువు మృతదేహాన్ని ఎండీఆర్ ఫౌండేషన్ స్వచ్ఛంధ సంస్థకు అప్ప గించడంతో అంత్యక్రియలు నిర్వహించారు.

అక్రమ తవ్వకాలను

అడ్డుకున్న రెవెన్యూ సిబ్బంది

శివ్వంపేట, మే 31 (ఆంధ్రజ్యోతి) : శివ్వంపేట మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల బాయన్న చెరువులో అక్రమ తవ్వకాలను రెవెన్యూ సిబ్బంది శనివారం అడ్డుకున్నారు. చెరువులో నిబంధనలకు విరు ద్ధంగా కొందరు వ్యక్తులు సిండికేట్‌గా ఏర్పడి గురువారం రాత్రి మట్టి తవ్వకాలు నిర్వహించి సంగారెడ్డి జిల్లా అన్నారం సమీపంలోనే ఇటుక బట్టీలకు తరలించారు. శుక్రవారం రాత్రి కూడా మట్టి తవ్వ కాలు నిర్వహించేందుకు ఏర్పాటు చేసుకోగా... గ్రామస్థులు ఇచ్చిన సమాచారం మేరకు తహసీల్దార్ కమలాద్రి ఆదేశాల మేరకు ఆర్ఐ సిబ్బందితో కలిసి చెరువు వద్దకు వెళ్లారు. అక్కడి నుంచి ఎక్స్‌కవేట ర్‌తో సహాయ వ్యక్తులు పరారయ్యారని ఆర్ఐ కిషన్ తెలిపారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల బాహాబాహి

- ఇందిరమ్మ ఇంటి శంకుస్థాపనలో వాగ్వాదం
- సీఎం ఫొటో పెట్టలేదని కాంగ్రెస్ నాయకుల అభ్యంతరం
- ఇరుపార్టీల వారికి నచ్చజెప్పిన పోలీసులు

హత్నూర, మే 31 (ఆంధ్రజ్యోతి): హత్నూర మండల పరిధిలోని ఎల్లమ్మ గూడెంలో శనివారం నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల శంకుస్థాపన కార్యక్ర మంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బాహాబాహికి దిగారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి భూమి పూజ చేస్తుండగా అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, మెదక్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి అక్కడికి చేరుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో పెట్టాలంటూ... కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు డిమాండ్ చేశారు. సీఎం ఫొటో ఉన్నప్పటికీ సరిగ్గా చూడకుండా అభ్యంతరం తెలపడం ఏంటని కొందరు బీఆర్ఎస్ నాయకులు సమాధానం ఇచ్చారు. అంతలోనే ఇరుపార్టీల నాయకులు జై కాంగ్రెస్, జై బీఆర్ఎస్ అంటూ నినాదాలు చేసు కున్నారు. అంతలోనే పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరుపార్టీల నాయకు లకు నచ్చచెప్పి శాంతింపజేశారు. అనంతరం ఇరుపార్టీల నాయకులు భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్ర మంలో ఎంపీడీవో శంకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కర్రే కృష్ణ, బీఆ ర్ఎస్ పార్టీ మండల అధ్య క్షుడు రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ వావిలాల నర్సింహులు, పీసీసీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్య దర్శి ఎంఏ.హకీం, ఆయా పార్టీల నాయకులు తదిత రులు పాల్గొన్నారు.


రేవంత్‌రెడ్డి చిత్రపటంతో నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


'నో టొబాకో డే' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న న్యాయాధికారులు

ధూమపానానికి

దూరంగా ఉండాలి

సంగారెడ్డి క్రైం/సంగారెడ్డి అర్బన్/హవేళిఘణపూర్, మే 31(ఆంధ్రజ్యోతి) : దేశంలో 90 శాతం నోటి క్యాన్సర్ వంటి వ్యాధులు పొగాకు వల్లే సంభవిస్తు న్నాయని జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయాధికారి డాక్టర్ కృష్ణార్జున్ అన్నారు. సంగారెడ్డిలోని జిల్లా కోర్టు సమావేశ మందిరంలో శనివారం పొగాకు వ్యతి రేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఆయన ముఖ్య అతి థిగా హాజరై మాట్లాడారు. అనంతరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇంచార్జి కార్యదర్శి, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి తేజో కార్తీక్ మాట్లాడారు. అనంతరం వరల్డ్ నో టొబాకో డేకి సంబంధించి ప్రతిజ్ఞ చేసి వాల్ పోస్ట ర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా నాలుగో అదనపు న్యాయాధికారి ఎం.లావణ్య, అదనపు సీనియర్ సివిల్ జడ్జి దీప్తి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్. అనిత, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.మహేష్ కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● ప్రతి ఒక్కరూ ధూమపానానికి దూరంగా ఉండాలని జిల్లా న్యాయసేవా ధికార సంస్థ (డీఎల్ఎస్ఏ)కార్యదర్శి తేజో కార్తీక్ పిలుపునిచ్చారు. సంగా రెడ్డి ఇంద్రనగర్‌లోని యూపీహెచ్‌సీ ప్రాంగణంలో ప్రపంచ పొగాకు నివా రణ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ధూమపానంతో అనారోగ్య సమ స్యలు వస్తాయని, మనిషి జీవితం ప్రాణాతకంగా మారుతుందన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీ, ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

● పొగాకు ఉత్పత్తులతో ఆరోగ్య సమస్యలు వస్తాయని మెదక్ సీనియర్ సివిల్ జడ్జి రుబీనా ఫాతిమ తెలిపారు. శనివారం హవేళిఘణపూర్‌లోని పంచాయతీ కార్యాలయం వద్ద న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆమె హాజరై మాట్లాడారు. బీడీ, సిగరెట్ ఇతర పొగాకు పదార్థాలు తాగడం వల్ల ప్రాణాంతకమైన క్యాన్సర్ వస్తుందన్నారు. ఇలాంటి దురలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎఎన్ఎంలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.




















కేసు వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

దొంగతనానికి వచ్చి.. మహిళను అంతమొందించి..

- రుక్మాపూర్ హత్యకేసును ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన జహీరాబాద్ డీఎస్పీ సైదానాయక్

న్యాల్‌కల్, మే 31(ఆంధ్రజ్యోతి) : ఇంట్లో దొంగతనానికి వచ్చిన ప్రబుద్ధుడు మహిళ చూసి ప్రతిఘటించడంతో హత్య చేశాడు. న్యాల్‌కల్ మండలంలోని రుక్మాపూర్ గ్రామంలో ఈ నెల 25 అర్ధరాత్రి జరిగిన మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించారు. శనివారం హద్నూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జహీరాబాద్ డీఎస్పీ సైదానాయక్ కేసు వివరాలను వెల్లడించారు. రుక్మాపూర్ గ్రామానికి చెందిన బోయిని ప్రశాంత్ ప్రైవేటు ఉద్యోగి. కొన్ని రోజులుగా క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాటుపడిన అతడు పెద్ద మొత్తంలో డబ్బులు పోగొట్టుకున్నాడు. దీంతో దొంగతనం చేసి డబ్బులు సంపాదించి క్రికెట్ బెట్టింగులు పెట్టాలని నిర్ణయించుకున్నాడు. అందులో భాగంగా ఈ నెల 25న అదే గ్రామానికి చెందిన రాణెమ్మ ఇంట్లో ఒంటరిగా ఉండడం గమనించి అర్ధరాత్రి సమయంలో వెళ్లి తలుపుతట్టాడు. ఆమె తలుపు తీయగానే బయటకు గుంజుకొచ్చి వరండాలో కిందపడేశాడు. పెనుగులాటలో రాణెమ్మ గాజులు పగలడంతోపాటు నిందితుడికి గాయాలయ్యాయి. దీంతో అతడు చేతులతో ఆమె ముక్కు, నోరు మూసి ఊపిరాడకుండా చేసి హతమార్చాడు. అనంతరం మృతదేహాన్ని ఇంట్లోని మంచంపై పడుకోబెట్టి ఆమె మెడలో ఉన్న బంగారు గుండ్లు, పుస్తెలతాడు, పక్కగదిలో ఉన్న ఇనుపపెట్టెలోని రూ.2720 నగదును తీసుకుని పరారయ్యాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా పోలీసులు మృతురాలి ఇంటి చుట్టుపక్కల వారిని విచారించారు. నిందితుడు ప్రశాంత్ ఇంటికి కూడా వెళ్లి విచారణ చేస్తుండగా అతని చేతికి తగిలిన గాయాలను పరిశీలించిన పోలీసులు తమదైన శైలిలో ఆరా తీయగా నేరాన్ని ఒప్పుకున్నాడు. అతడి నుంచి మహిళ బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో సీఐ జక్కుల హన్మంతు, ఎస్‌ఐ రాజశేఖర్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెచ్చిపోయిన దొంగలు

- మూడు వేర్వేరు ఘటనల్లో నగలు, నగదు వస్తువులు చోరీ

మెదక్, సంగారెడ్డి జిల్లాలో శనివారం మూడుచోట్ల దొంగతనాలు చోటు చేసుకున్నాయి. కంది గ్రామంలో రెండు చోట్ల, నిజాంపేట మండలం కల్వకుంటలో పెద్దమ్మతల్లి ఆలయంలో, వెల్దుర్తి మండలం మంగళపర్తి గ్రామంలోని ఓ ఇంట్లో నగదు, నగలు, వస్తువులు చోరీకి పాల్పడ్డారు.

కంది, మే 31 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉన్న మండల కేంద్రమైన కంది గ్రామంలో దొంగలు చెలరేగిపోయారు. శుక్రవారం తెల్లవారుజామున కొత్త కందిలోని పాండురంగ స్వామి వీధిలో తాళం వేసి ఉన్న జగదీష్ అనే యజమాని ఇంటిని కొల్లగొట్టారు. ఆ ఇంట్లో నుంచి తులం న్నర బంగారం, వెండి పూజా సామాగ్రి వస్తువులు, కొంత నగదును దోచుకెళ్లారు. క్లూస్ టీం ద్వారా వివరాలు సేకరించినప్పటికీ ఎలాంటి ఆధారాలు పోలీసులకు దొరకలేదు. మళ్లీ శనివారం తెల్లవారుజామున కంది శివారులో ఉన్న ఓ డాక్యుమెంట్ రైటర్ షాప్‌లో ఇదే తరహాలో తాళం పగలగొట్టి షెట్టర్ తెరిచి దర్జాగా లోపలికి వెళ్లారు. అందులో నుంచి ఒక సీపీయూ (కంప్యూటర్ ప్రాసెస్ యూనిట్) ఒక మానిటర్‌ను తస్కరించారు. పోలీసులు ఎంత నిఘా ఏర్పాటు చేసినప్పటికీ దొంగతనాలు మాత్రం ఆగటం లేదని కంది గ్రామస్థులు వాపోతున్నారు. కంది గ్రామం మొత్తం సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ కూడా దొంగలు జంకు లేకుండా చోరీలకు పాల్పడుతున్నారు. వెంటనే పోలీసు ఉన్నతాధికారులు స్పందించి కంది గ్రామంలో రాత్రిపూట పోలీసుల గస్తీ పెంచాలని కోరుతున్నారు.

పెద్దమ్మ ఆలయంలో..


ఆలయాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నిజాంపేట, మే 31(ఆంధ్రజ్యోతి): నిజాంపేట మండలం కల్వకుంట గ్రామంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో ఎప్పటిలాగే శుక్రవారం సాయంత్రం పూజలు నిర్వహించి ఆలయానికి తాళం వేసి వెళ్లారు. కాగా రాత్రి గుర్తు తెలియని దుండగులు ఆలయం తాళాన్ని పగులగొట్టి చొరబడి అమ్మవారి పుస్తె మట్టెలు, నగదు అపహరించారు. శనివారం ఉదయం ఆలయ నిర్వాహకులు వచ్చి చూడగా ఆలయానికి ఉన్న తాళం పగలగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి పరిశీలించగా అమ్మవారి నగలతో పాటు ఆలయ హుండీలోని నగదు కనిపించలేదు. చోరీకి గురైందని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు అక్కడికి చేరుకొని పరిశీలించారు. అలాగే వెంకటాపూర్, నార్లాపూర్ గ్రామాలలో ఉన్న ఆలయాల్లో కూడా చోరీకి ప్రయత్నం చేశారని ఎలాంటి నష్టం జరగలేదని తెలిపారు. ఆలయ నిర్వాకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో..

వెల్దుర్తి, మే31(ఆంధ్రజ్యోతి) : తాళం వేసిన ఇంట్లో చోరి జరిగిన ఘటన వెల్దుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మంగళపర్తి గ్రామానికి చెందిన మ్యాదరి నర్సింహులు ఈ నెల 28న తమ కుటుంబ సభ్యులతో కలిసి జిన్నారం లోని తమ బంధువుల ఇంటికి వెళ్లారు. శనివారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఉన్నది. లోపలికి వెళ్లి చూడగా బీరువాను ధ్వంసం చేసి అందులోని రూ. 45వేల నగదు దుండగులు దొంగిలించారని గుర్తించాడు. ఈ మేరకు బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


మృతి చెందిన అశోక్

సంగారెడ్డి క్రైం, మే 31 (ఆంధ్రజ్యోతి) : చికిత్సపొందుతూ వ్యక్తి మృతి చెందినట్లు పట్టణ సీఐ రమేష్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 17న సంగారెడ్డి పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలో జాతీయ రహదారి పక్కన గుర్తు తెలియని వ్యక్తి(60) స్పృహలేకుండా పడి ఉన్నాడు. అతడిని 108 సిబ్బంది చికిత్స నిమిత్తం సంగారెడ్డి జిల్లా జనరల్ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి పేరు అశోక్, అతడి తండ్రి కుల్దీప్‌గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ఏ ప్రాంతానికి చెందినవాడో తెలియలేదనీ, ఎవరైనా గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కేసుకు భయపడి వ్యక్తి ఆత్మహత్య

జహీరాబాద్, మే 31(ఆంధ్రజ్యోతి) : కేసు అవుతుందని భయపడిన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జహీరాబాద్ పట్టణంలోని అల్లీపూర్‌లో శనివారం జరిగింది. ఎస్‌ఐ కాశీనాథ్ కథనం ప్రకారం అల్లీపూర్‌కు చెందిన రేఖతో అనిల్‌కుమార్(30)కు నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. ఇటీవల వారి కుమారుడి ఆరోగ్యం బాగులేకపోవడంతో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడం.. గొడవలు జరగడంతో భార్య రేఖ పోలీసులను ఆశ్రయించింది. దీంతో తనపై కేసు అవుతుందనే భయంతో అనిల్‌కుమార్ అల్లీపూర్‌లోని ఈద్గా వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నీ గుమ్మం వద్దకే..

ఒక్క క్లిక్‌తో ఇంటి నుంచే ఆన్‌లైన్ షాపింగ్





- అరచేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు
- జిల్లాలో విస్తరిస్తున్న ఈ కామర్స్ సేల్స్
- నిత్యావసర వస్తువులు, తినుబండారాలు సైతం ఆర్డర్
- ప్రతీ రోజు రూ.లక్షల్లో వ్యాపారం.. యువతకు ఉపాధి

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, మే 31: ఒకప్పుడు కుటుంబ సమేతంగా దుకాణాలు, షాపింగ్‌మాల్స్‌కి వెళ్లి తమకు నచ్చిన రంగులు, వస్తువుల నాణ్యతను బట్టి అవసరమైనవన్నీ కొనుగోలు చేస్తుండేవారు. ధర గిట్టుబాటు కాకుంటే బేరమాడి మరీ తక్కువకు కొనుగోలు చేసేవారు. కానీ ఇప్పుడు ఆ రోజులు పోయాయి. ఆధునిక జీవితంలో వృత్తిపరంగా ఎదుర్కొంటున్న సమస్యలో, పని ఒత్తిడి వల్లో తెలియదు కానీ, పలు కారణాల వల్ల ఇంటి గుమ్మం దాటి బయటకు వెళ్లి షాపింగ్ చేయాలంటే చాలా మంది ఆసక్తి కనబరచడంలేదు. తమకు నచ్చిన వాటిని ఎంచక్కా ఆన్‌లైన్‌లోనే కొనుగోలు చేస్తున్నారు. అరచేతిలో ఉన్న మొబైల్ ద్వారా పలు ఈ కామర్స్‌లకు చెందిన యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకొని, అన్నీ గుమ్మం వద్దకు వచ్చేలా ఒక్క క్లిక్‌తో ఆర్డర్ పెడుతున్నారు. దీంతో సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా పలు ఈ కామర్స్‌లకు చెందిన ఆన్‌లైన్ కొనుగోలుతో లక్షల్లో వ్యాపారం జరుగుతున్నది.

స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు..

ఒక స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు ఎక్కడి నుంచైనా.. ఏ వస్తువైనా ఇంటి దగ్గర ఉండే కొనుగోలు చేయవచ్చు. ప్రస్తుతం ప్రతీ ఒక్కరి చేతిలో ఆండ్రాయిడ్ మొబైల్ ఉంటుంది. ఏ సమాచారం కావాలన్నా సరే మొబైల్‌లోని గూగుల్‌లో సెర్చ్ చేస్తే చాలు అన్నీ విషయాలు క్షణాల్లో తెలిసిపోతున్నాయి. ఇక షాపింగ్ విషయానికి వస్తే తమకు కావాల్సిన వాటిని సమయం దొరికినప్పుడల్లా ఈ కామర్స్‌లకు చెందిన యాప్‌లలో ఆర్డర్ చేస్తే మూడు నాలుగు రోజుల్లో ఇంటివద్దకు చేరుతున్నాయి. వీటిలో మరి త్వరగా కావాలనుకుంటే ఒకటి రెండు రోజుల్లో కూడా వచ్చే యాప్‌లు కూడా ఉన్నాయి. దుస్తులు, ఫర్నిచర్, ఎలక్ట్రానిక్ వస్తువులు, మెడికల్‌కు సంబంధించిన సామాగ్రి, మందులు, చర్మానికి సంబంధించిన క్రీములు, నిత్యవసర సరుకులు ఇలా ఒక్కటేమిటి అన్నీ యాప్‌లో అందుబాటులో ఉంటున్నాయి. మనుషులతో పాటు ఇంట్లో పెంచుకునే కుక్కలకు సంబంధించినవి సైతం లభిస్తున్నాయి.

దేశ నలుమూలల నుంచి..

రాష్ట్రంలోని హైదరాబాద్‌లాంటి నగరాలతో పాటు న్యూ ఢిల్లీ, ముంబయి, పూణేలతో పాటు దేశంలోని నలుమూలల నుంచి ఉత్పత్తిదారులు తయారుచేసిన వాటిని సిద్దిపేట జిల్లాలోకి వినియోగదారులు ఆన్‌లైన్ ద్వారా దిగుమతి చేసుకుంటున్నారు. చాలా దూర ప్రాంతాల నుంచి వస్తువులు వస్తుండటంతో ఒక్కో సందర్భంలో వారం నుంచి పది రోజుల సమయం పడుతున్నది. నేరుగా ఆన్‌లైన్‌లో కొనుగోలు చేస్తుండటంతో బయట ధరతో పోల్చుకుంటే తక్కువ ధరకు లభ్యమవుతుండటంతో వినియోగదారులు ఆన్‌లైన్ కొనుగోలుకే మక్కువ చూపుతున్నారు. ఉత్పత్తిదారులు కూడా సాధ్యమైనంత మేరకు నాణ్యత విషయంలో వినియోగదారులకు నచ్చేలా బ్రాండ్‌కు తగ్గట్లుగా తయారుచేస్తున్నారు. అంతేగాక వచ్చిన ఆర్డర్లు తీసుకున్న తరువాత ఇతర కారణాలతో అవి నచ్చకపోతే తిరిగి పంపించేందుకు (రిటర్న్ ఆప్షన్) కూడా ఉత్పత్తిదారులు అవకాశాన్ని కల్పించారు.

నిత్యం రూ.లక్షల్లో వ్యాపారం..

ప్రతీరోజు సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా రూ.లక్షల్లో ఆన్‌లైన్ వ్యాపారం జరుగుతున్నది. సగటున దాదాపు రూ.30వేల నుంచి రూ.50 వేలకు పైగా ఆయా ఉత్పత్తిదారుల నుంచి వస్తువులు వినియోగదారులకు చేరుతున్నాయి. ఈ కామర్స్ వ్యాపారం వల్ల అటు యువతకు కూడా ఉపాధి అవకాశాలు దక్కుతున్నాయి. ఉదయాన్నే వచ్చిన ఆర్డర్‌లు తీసుకొని ఆయా ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఒకరి నుంచి మరొకరికి పాకిన ఈ యాప్‌ల వల్ల ఇప్పుడు ఆన్‌లైన్ షాపింగ్‌కు యమ క్రేజ్ పెరుగుతున్నది. వినియోగదారులపై ఎలాంటి పన్నులు విధించకపోవడం, దానికి తోడు ఉచితంగా డోర్ డెలవరీ చేస్తుండటంతో ఆన్‌లైన్ ఆర్డర్‌ల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలు అన్నట్లుగా సాగుతున్నది.

ఫేక్ యాప్‌లతో నష్టం..

కాగా ఈ కామర్స్ వల్ల వ్యాపారాలు సమృద్ధిగా సాగుతుండటంతో కొందరు సోషల్ మీడియాను వేదికగా చేసుకొని ఫేక్ యాప్‌లు, లింక్‌లు ఏర్పాటు చేసి గ్రూపుల్లో పోస్టు చేస్తున్నారు. ఆ లింక్‌లపై క్లిక్ చేయగానే డబ్బులు ఖాతా నుంచి మాయమవుతున్నాయి. ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్ బిజినెస్ గ్రూపు, ఫేస్‌బుక్, ఎక్స్ లాంటి తదతర వాటిలో డిస్కౌంట్ చూపిస్తూ వినియోగదారులను ఆకర్షించి మోసాలకు పాల్పడుతున్నారు. జిల్లాలో ఇలాంటి మోసాల వల్ల వినియోగదారులు చాలమంది నష్టపోయినట్లు తెలిసింది. సోషల్‌మీడియాలో ఒకటి చూపెట్టి వినియోగదారుడికి మరొకటి పంపిస్తున్నారు. అవి తిరిగి పంపించేందుకు వీలు లేకపోవడంతో వినియోగదారులు లబోదిబోమంటున్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



దిగ్గజ సంస్థలైన ఈ కామర్స్ ద్వారానే, నమ్మకమనిపిస్తేనే కొనుగోలు చేయాలి. సోషల్ మీడియా వేదిక చేసుకొని కొందరు కేటుగాళ్లు ఫేక్ యాప్‌ల ద్వారా ప్రజలను మోసం చేస్తున్నారు. వ్యక్తిగతంగా, వాట్సప్ గ్రూప్‌లలో పంపిన లింకులను ఓపెన్ చేయవద్దు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే మొబైల్ నంబర్ 8126655565కు గాని లేదా సిద్దిపేట జిల్లాలోని సీపీ కార్యాలయం రెండవ అంతస్తులో ఉన్న సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాలి.

-శ్రీనివాస్, ఏసీపీ, సైబర్ క్రైమ్, సిద్దిపేట

మహిళలకు మంత్రి పదవులు ఇవ్వనప్పుడు

కవిత ఎందుకు మాట్లాడలే?

- ఇప్పుడు సామాజిక తెలంగాణ అనడం విడ్డూరం
- మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు



గజ్వేల్ పట్టణంలో అహల్యాబాయి జయంతి ర్యాలీలో పాల్గొన్న ఎంపీ రఘునందన్‌రావు

గజ్వేల్/గజ్వేల్‌రూరల్/మెదక్ అర్బన్, మే 31 (ఆంధ్రజ్యోతి): మహిళలకు మంత్రి పదవులు ఇవ్వనప్పుడు కవిత ఎందుకు మాట్లాడలేదని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు ప్రశ్నించారు. లోకమాత అహల్యాబాయి 300వ జయంతి సందర్భంగా సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. కవితమ్మ కొత్తగా సామాజిక తెలంగాణ నినాదాన్ని ఎత్తుకుందని, 2014, 2018లో ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉన్నప్పుడు బీసీలకు జనాభా దామాషా పద్ధతి ప్రకారం ఎందుకు మంత్రి పదవులు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఆనాడు ఆమె తండ్రిని ఎందుకు అడుగలేదన్నారు. ఆర్టికల్ 370ని రద్దు చేశామని, 12 మంది మహిళలకు మంత్రి పదవులు ఇచ్చామని, బీసీ కమీషన్‌కు రాజ్యాంగ భద్రత, బీసీ, ఎస్సీ, ఎస్టీలకు మంత్రి పదవులు ఇచ్చామని తెలిపారు. అధికారంలో ఉన్నప్పుడు బీసీలకు ఇవ్వలేదని, పూలే విగ్రహం పెట్టలేదని, మహిళలకు మంత్రి పదవి ఇవ్వకపోతే నిజామాబాద్ ఎంపీ పదవికి రాజీనామా చేయలేదో చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఆయనవెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్, సామాజిక సమరసత వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నరేశ్‌బాబు, నాయకులు నందన్‌గౌడ్, మనోహర్‌యాదవ్, మహేశ్, సురేశ్, అశోక్‌గౌడ్ తదితరులున్నారు. అలాగే జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కవితారెడ్డి ఆధ్వర్యంలో అహల్యాబాయి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ అహల్యబాయి హోల్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

● వర్గల్, మే 31 (ఆంధ్రజ్యోతి): నవోదయ విద్యాలయానికి బొలేరోను ఎంపీ రఘునందన్‌రావు అందజేశారు. ప్రిన్సిపాల్ అభ్యర్థన మేరకు హెటిరో ఫార్మా పరిశ్రమతో కలసి వాహనాన్ని అందజేశారు.

రైల్వే సమస్యలు పరిష్కరించాలి

రామచంద్రాపురం, మే 31 (ఆంధ్రజ్యోతి) : మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో నెలకొన్న రైల్వే సమస్యలను పరిష్కరించాలని ఎంపీ రఘునందన్‌రావు రైల్వే శాఖ కేంద్ర సహాయ మంత్రి సోమన్నను కోరారు. శనివారం హైదరాబాద్ నుంచి కర్ణాటకకు బయలుదేరిన మంత్రిని రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ మున్సిపాలిటీ ఈదులనాగులపల్లి వద్ద బీజేపీ ఎమ్మెల్సీ సి.అంజిరెడ్డి, జిల్లా అధ్యక్షురాలు సి.గోదావరి అంజిరెడ్డి, మున్సిపల్ అధ్యక్షులు రాంబాబు, మహేందర్ తదితర నాయకులు కలిసి సమస్యలను వివరించారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'పదిరోజులని నెలలపాటు మూసివేత' కథనానికి స్పందించిన మంత్రి నాగులపల్లి రైల్వేగేట్‌ను పునరుద్ధరించాలని అధికారులకు ఆదేశించారు.


భూ బాధితులకు నచ్చచెబుతున్న పోలీసులు

సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ వద్ద భూ బాధిత కుటుంబం ఆందోళన

పుల్‌కల్, మే 31 (ఆంధ్రజ్యోతి): భూ పరిహారానికి సంబంధించి హామీలు నెరవేర్చకుండా తమ భూమిలో పనులెలా చేస్తారని బాధితుడు గొల్ల మల్లేశం కుటుంబంతో కలిసి శనివారం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ వద్ద ఆందోళనకు దిగాడు. చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ గ్రామ శివారులోని సర్వే నంబర్ 40/ఇలోని మల్లేశంకు చెందిన 3.05 ఎకరాల భూమిని జేఎన్టీయూ నిర్మాణానికి 2012లో సేకరించారు. దీనికోసం పరిహారం కింద అప్పట్లో రూ.8,70,434 మంజూరుకాగా, రెవెన్యూ అధికారులు ఆ భూమిని జేఎన్టీయూ పేరున బదాలయించారు. పరిహారం ఏ మాత్రం సరిపోదంటూ బాధితుడు కోర్టును ఆశ్రయించడంతో చేసేదేమీలేక జేఎన్టీయూ అధికారులు మిన్నకుండిపోయారు. మంజూరైన పరిహారాన్ని అందోలు-జోగిపేట ఆర్డీవో ఖాతాలో జమ చేశారు. ఈ నేపథ్యంలో గొల్ల మల్లేశం గతంలో ధరణి పోర్టల్ ఆధారంగా 3.05 ఎకరాల భూమిని తిరిగి తన పేరున మార్పిడి చేయించుకున్నాడు. ఆరు నెలల క్రితమే ఈ విషయాన్ని తెలుసుకున్న జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. తప్పును గుర్తించిన ఉన్నతాధికారులు ఆ భూమిని మళ్లీ ఆ కళాశాల పేరున మార్చారు. దీన్ని తప్పు పడుతూ బాధితుడు గత డిసెంబరు 30న అధికారులతో వాగ్వివాదానికి దిగి, ఒంటిపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారు. ఈ విషయంలో మంత్రి దామోదర చొరవ చూపి కుటుంబ సభ్యుల్లో అర్హులైన వారికి జేఎన్టీయూలో టైం స్కేల్ పే ఉద్యోగాలు, జీవనాధారం కోసం నాలుగు గుంటలు భూమి ఇచ్చేలా చర్యలు తీసుకుంటానని అప్పట్లో హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది. ఈ నేపథ్యంలో జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఎడమ వైపున మిగిలిపోయిన ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న భూ బాధితుడు గొల్ల మల్లేశం శనివారం భార్య సాయమ్మ, కుమారుడు రవి ఇతర కుటుంబ సభ్యులతో కలిసి పెట్రోలు డబ్బా వెంటబెట్టుకుని వచ్చి పనులను అడ్డుకున్నారు. మంత్రి ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా పనులు ఎలా చేస్తారని ఆందోళనకు దిగాడు. న్యాయం చేయకుంటే కుటుంబ సభ్యులందరం పెట్రోలు పోసుకుని ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న జోగిపేట సీఐ అనిల్‌కుమార్ పోలీసు సిబ్బంది జేఎన్టీయూ వద్దకు చేరుకుని బాధితులకు నచ్చజెప్పి, కళాశాల ప్రిన్సిపాల్ వద్దకు తీసుకువెళ్లారు. టైం స్కేల్ పే ఉద్యోగం ఇప్పించాలని బాధితులు కోరగా పర్మినెంట్ ఉద్యోగం నా చేతుల్లో లేదని ప్రిన్సిపాల్ నరసింహ తెలిపారు. ఈ మేరకు పోలీసులు బాధితులకు నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించారు.

జాతీయ రోయింగ్ పోటీల్లో హుస్నాబాద్ విద్యార్థి ప్రతిభ


రోయింగ్ పోటీల్లో అభిజిత్ యాదవ్

హుస్నాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి) : మే 27 నుంచి 31వ తేదీ వరకు హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్‌లో నిర్వహించిన నేషనల్ సబ్ జూనియర్ రోయింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో హుస్నాబాద్‌కు చెందిన కాశబోయిన అభిజిత్‌యాదవ్ ప్రతిభ చాటాడు. క్వాటర్స్‌లో గోల్డ్ మెడల్, డబుల్స్‌లో సిల్వర్ మెడల్ సాధించాడు. అభిజిత్ హైదరాబాద్‌లోని హకీంపేటలోని స్పోర్ట్స్ స్కూల్‌లో చదువుతున్నాడు. ఈ మెడల్స్ సాధించడంపై హుస్నాబాద్ పట్టణానికి పలువురు క్రీడాకారులు అభినందనలు తెలిపారు.







సంప్రదాయ వేడుకల సందడి

- ఐఐటీహెచ్‌లో ఆకట్టుకున్న శాస్త్రీయ కళా ప్రదర్శనలు
- కొనసాగుతున్న స్పిక్ మైకే సదస్సు

కంది, మే 31 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌లో శనివారం స్పిక్ మైకే అంతర్జాతీయ సదస్సు ఆరవ రోజు కొనసాగింది. భారతీయ శాస్త్రీయ కళలలో అత్యుత్తమమైన వాటిలో విద్యార్థులను ముంచెత్తే అనుభవాన్ని ఈ వేడుక పరిచయం చేసిందని సాహితీవేత్తలు ప్రశంసించారు. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి హఠ యోగా, నాద్ యోగా, ధ్యానం శ్రమదాన్, ఇంటెన్సివ్ వర్క్‌షాప్‌లు జరిగాయి. మధ్యాహ్నం యోగ నిద్ర కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం విద్వాన్ జీజేఆర్ కృష్ణన్, విదుషి లాల్గుడి విజయలక్ష్మి కర్ణాటక వయోలిన్, పండిట్ ఉల్హాస్ కషల్కర్ హిందుస్తానీ గాత్రం, పండిట్ సురేష్ తల్వాల్కర్, తబలా ఉస్తాద్ బహౌద్దీన్ దాగర్, రుద్ర వీణ, విదుషి కపిల వేణు కూడియాట్టం, ఉస్తాద్ ఎఫ్. వసీఫుద్దీన్ దాగర్ ధ్రుపద్ కార్యక్రమాలు వీనుల విందుగా జరిగాయి. ఈ సదస్సులో స్పిక్ మైకే జాతీయ చైర్‌పర్సన్ ఆర్.ఎం. తివారీ, సాహితీ వేత్తలు, పండితులు, సంగీత విద్వాంసులు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

రంగస్థల కళావేదిక గౌరవ అధ్యక్షుడిగా రవీందర్‌రెడ్డి

ఐడీఏబొల్లారం, మే 31 (ఆంధ్రజ్యోతి) : ఐడీఏబొల్లారం పారిశ్రామికవాడ శివసాయి రంగస్థల కళావేదిక నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మాజీ ఎంపీపీ కొలన్ రవీందర్‌రెడ్డి, అధ్యక్షుడు ఆర్.లక్ష్మీనాయుడు, ప్రధాన కార్యదర్శి పి.అనంతరావును రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంగీత విద్వాంసులు నామనాయుడు, మేడ్చల్-మల్కాజిగిరి అధ్యక్షుడు మణిపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఛాగంటి సాయిలక్ష్మి పాల్గొన్నారు.

'నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు'

టేక్మాల్, మే 31 (ఆంధ్రజ్యోతి) : నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని టేక్మాల్ వ్యవసాయ అధికారి రాంప్రసాద్ హెచ్చరించారు. మండల కేంద్రమైన టేక్మాల్, బొడ్మట్‌పల్లిలోని ఎరువుల దుకాణాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన సమయాల్లో ఎరువుల దుకాణం వద్ద రశీదును తప్పనిసరిగా తీసుకువాలని తెలిపారు. ఫర్టిలైజర్ వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే సహించే ప్రసక్తి లేదని హెచ్చరించారు.

బెస్ట్ అవేలబుల్ స్కూల్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

నారాయణఖేడ్, మే 31 (ఆంధ్రజ్యోతి) : బెస్ట్ అవెలేబుల్ స్కూల్‌గా గుర్తింపు పొందిన నియోప్రగతి పాఠశాలలో 2025-26 సంవత్సరంలో మొదటి తరగతి నుంచి ఐదో తరగతిలో ప్రవేశానికి ఎస్సీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ ప్రకాష్ శనివారం ప్రకటనలో కోరారు. అప్లికేషన్ ఫారాలను జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని కలెక్టర్ కార్యాలయంలో జూన్ 13లోగా సమర్పించాలని, ఎవరైనా అక్కడికి వెళ్లడానికి ఇబ్బంది ఉంటే తమకు పాఠశాలలో అందిస్తే తాము కలెక్టర్ కార్యాలయంలో సమర్పిస్తామన్నారు.

వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌పై అవగాహన

కంగ్టి/పాపన్నపేట, మే 31 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బీంరా, తుర్కవడగాం, దెగుల్‌వాడి తదితర గ్రామాల్లో శనివారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ శ్రేణి కార్యక్రమంలో భాగంగా రైతులకు వివిధ పథకాలపై వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. పాపన్నపేట మండలం మల్లంపేటలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీఏఆర్ శాస్త్రవేత్త డాక్టర్ పాపారావు, ఐఐఆర్ఆర్ శాస్త్రవేత్త డాక్టర్ ప్రసన్న, తునికి శాస్త్రవేత్త శ్రీనివాస్ మాట్లాడారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

చిన్నశంకరంపేట, మే 31 (ఆంధ్రజ్యోతి) : చిన్న శంకరంపేట మండలంలోని కామారం గ్రామంలో సానిక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో మల్లారెడ్డి హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. 200 మందికి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కంటి ఆపరేషన్ చేయించేందుకు మల్లారెడ్డి ఆసుపత్రికి ఉచిత బస్సు సౌకర్యం, ఏర్పాట్లు కల్పిస్తున్నట్లు వైద్యులు తెలిపారు.

విద్యార్థుల భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టొద్దు

వెల్దుర్తి, మే 31 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల భవిష్యత్‌ను అంధకారంలో నెట్టేవిధంగా తీసుకొచ్చిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం శనివారం ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం మిగులు టీచర్లను సర్దుబాటు చేయాలనే ఉద్దేశంతో తీసుకొచ్చిన ఉత్తర్వులు రద్దు చేయాలన్నారు.

ఘనంగా హనుమాన్ విగ్రహ పునఃప్రతిష్ఠాపన

మనోహరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి) : మనోహరాబాద్ మండలం రంగాయపల్లి గ్రామంలో హనుమాన్ ఆలయంలో హనుమాన్ విగ్రహ పునఃప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలు మూడురోజులు నిర్వహించనున్నారు. శనివారం గణపతి పూజ, అఖండ దీపాస్థాపన, అగ్నిప్రతిష్ఠ, స్థాప్య దేవత హోమాలు, మూల మంత్ర హవనములు, పండితులు రాములుశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు.

సంబంధంలేని భూమి విక్రయించిన వ్యక్తిపై కేసు

చేగుంట, మే 31 (ఆంధ్రజ్యోతి) : చేగుంట మండల పరిధి చిట్టోజిపల్లి గ్రామ శివారులో తన భూమి అంటూ నమ్మించి విక్రయించి మోసానికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చైతన్య కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. చేగుంట మండల పరిధిలోని చిట్టోజిపల్లి గ్రామ శివారులోని సర్వే నంబరు 266/1లోని 320 ఎకరాల భూమి తనదే అంటూ గోల్కొండ కృష్ణవేణి సోదరుడు పోచంపల్లి కిషన్‌రావు కొంత మంది అమాయకులను నమ్మించి భూమి అగ్రిమెంట్ చేసుకుని వారి నుంచి అడ్వాన్స్‌గా తీసుకున్నాడు. అమాయక ప్రజలను నమ్మించి మోసం చేసి డబ్బులు కాజేశాడని రైతుల ఫిర్యాదు మేరకు కిషన్‌రావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఖేడ్ డిపోకు పూర్వ వైభవం తీసుకొస్తాం

- కొత్త బస్సులతో మెరుగైన సేవలు
- ఎమ్మెల్యే సంజీవరెడ్డి



ఖేడ్‌లో నూతన బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్/నాగల్‌గిద్ద, మే 31 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ ఆర్టీసీ డిపోకు పూర్వ వైభవం తీసుకొస్తామని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. శనివారం నారాయణఖేడ్‌లో మూడు నూతన బస్సులను ప్రారంభించి మాట్లాడారు. గతంలో ఖేడ్ డిపో ద్వారా అనేక గ్రామీణ ప్రాంతాలకు బస్సులు నడిపేవారని, గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల అనేక గ్రామాలు బస్సు సౌకర్యానికి దూరం అయ్యాయన్నారు. దీంతో తాము డిపోకు రాష్ట్ర రవాణామంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరి 30 బస్సులు తీసుకొచ్చామన్నారు. ఖేడ్ నుంచి గతంలో మాదిరిగా జహీరాబాద్‌కు ప్రతిరోజు రాత్రి 7 గంటలకు నైట్ హాల్ట్ బస్సును నడపనున్నారని, తిరిగి అక్కడి నుంచి ఉదయం 5.30 గంటలకు నారాయణఖేడ్‌కు వస్తుందన్నారు. కరస్‌గుత్తి నుంచి నారాయణఖేడ్ మీదుగా హైదరాబాద్‌కు బస్సు సౌకర్యం కల్పించామన్నారు. కంగ్టి నుంచి కూడా హైదరాబాద్‌కు బస్సు సౌకర్యాన్ని కల్పించేందుకు కంగ్టి నైట్ హాల్ట్‌ను ప్రారంభిమన్నారు. గతంలో మాదిరిగా ఆర్టీసీ బస్సులు అన్నిరూట్లలో నడపాలని ఆయన డీఎంకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎం మల్లేశయ్య, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే కరస్‌గుత్తి వరకు బస్సులో ప్రయాణం చేశారు. ఆస్పత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని కరస్‌గుత్తి ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టిక పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోపాన్‌రావుపాటిల్, సచిన్‌పటేల్, అనిల్‌పటేల్, గంగారెడ్డి పాల్గొన్నారు.

ఆడపడుచులకు అండగా కల్యాణలక్ష్మి : రోహిత్‌రావు


లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

మెదక్ అర్బన్, మే 31 (ఆంధ్రజ్యోతి): పేదింటి ఆడపడుచులకు అండగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ఉందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు పేర్కొన్నారు. శనివారం స్థానిక మార్కెట్ కమిటీ యార్డ్‌లో పట్టణంలోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. సబ్బండ వర్గాల ప్రజలకు అండగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు శ్రీనివాస్ చౌదరి, మాజీ ఏఎంసీ చైర్మన్ మధుసూదన్ రావు, మండల అధ్యక్షుడు శంకర్, మాజీ కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అగ్గిపెట్టెలో పట్టే చీరలునేసిన ఘనత పద్మశాలీలది : ఎమ్మెల్యే

సంగారెడ్డి రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి) : అగ్గిపెట్టెలో చీరలు నేసి రాజులను మెప్పించిన చరిత్ర పద్మశాలీలకు ఉన్నదని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ గుర్తుచేశారు. శనివారం సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేట గ్రామంలో పద్మశాలీ భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వంలో కుల సంఘాలను ఆదరిస్తూ వారికి కావాల్సిన అన్ని రకాల కమ్యూనిటీ భవనాలను నిర్మించుకునేందుకు కృషి చేసిందన్నారు. సంఘం భవనానికి అదనంగా నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరగా.. తప్పకుండా సహకరిస్తానని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, బీఆర్ఎస్ నేతలు రఘు, సుధీర్‌రెడ్డి, శ్రీనివాస్, విఠల్, శ్రీధర్‌రెడ్డి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవతల దీవెనలు ప్రజలపై ఉండాలి

- ఎమ్మెల్యే సునీతారెడ్డి


ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

వెల్దుర్తి, మే 31 (ఆంధ్రజ్యోతి) : ప్రజలందరిపై గ్రామదేవతల దీవెనలు ఉండాలని ఎమ్మెల్యే సునీతా రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని బస్వాపూర్‌లో గ్రామ దేవతల విగ్రహాల ప్రతిష్ఠాపనలో పాల్గొని మాట్లాడారు. భగవంతుడి కృప అందరిపై ఉండాలని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. మండలంలోని దామరంచ గ్రామానికి చెందిన కర్రోళ్ల పోచమ్మకు, ఆరెగూడెం గ్రామానికి చెందిన కొడే అనూషకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. అలాగే టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కౌడిపల్లి మండలం ముట్రాజ్‌పల్లిలో శనివారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గుంజరి ప్రవీణ్, మాజీ సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోండి



జిన్నారం పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రభాకర్

సంగారెడ్డి క్రైం/జిన్నారం/ఐడీఏబొల్లారం, మే 31 (ఆంధ్రజ్యోతి) : కుల, మతాలకతీతంగా పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలని సంగారెడ్డి డీఎస్పీ కె.సత్తయ్యగౌడ్ కోరారు. సంగారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శనివారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. రానున్న బక్రీద్, ఇతర పండుగల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని మతాల పెద్దలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో పట్టణ సీఐ రమేష్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్, ఎస్ఐ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు. పండుగలను శాంతియుతంగా వాతావరణంలో జరుపుకోవాలని డీఎస్పీ ప్రభాకర్ అన్నారు. శనివారం జిన్నారం పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో డీఎస్పీ పాల్గొని మాట్లాడారు. బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ నయిమొద్దీన్, ఎస్ఐలు నాగలక్ష్మి, సుధాకర్‌చారి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. అలాగే జహీరాబాద్ పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌ల్ నిర్వహించిన శాంతి సమావేశంలో డీఎస్పీ సైదానాయక్ మాట్లాడారు. ఐడీఏబొల్లారం పట్టణంలో బక్రీద్ పండుగ నేపథ్యంలో శనివారం సీఐ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు.

కాలనీల్లో మౌలిక సదుపాయాలకు పెద్దపీట


పైపులైన్ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి) : కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించడానికి అన్నిరకాలుగా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం రామచంద్రాపురం డివిజన్ పరిధి శ్రీనివాస్‌నగర్ కాలనీలో రూ.1.6 కోట్లతో నిర్మించతలపెట్టిన మురుగు నీటి పారుదల పైపులైన్ నిర్మాణ పనులు కార్పొరేటర్ పుష్పానగేష్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీలతోపాటు బస్తీల్లో సైతం పూర్తిస్థాయి అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు. పర్యాటక కేంద్రంగా రాయసముద్రం చెరువును తీర్చిదిద్దుతామని వివరించారు.

ఉద్యోగ విరమణ సహజం : సంగారెడ్డి ఎస్పీ


ఉద్యోగ విరమణ చేసిన పోలీసులను సన్మానిస్తున్న ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి క్రైం/న్యాల్‌కల్, మే 31 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని, నిస్వార్థ సేవలే మంచి గుర్తింపును తెచ్చిపెడతాయని ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన ఎస్ఐలు విఠల్, సుదర్శన్, ఏఎస్ఐ రాజేందర్‌రెడ్డి, విలియం కెన్స్వెల్కర్‌ను శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ పంకజ్ మాట్లాడుతూ పోలీసుశాఖకు వారందించిన సేవలు మరువలేనివన్నారు. పోలీస్‌శాఖ తరపున ఉద్యోగ విరమణ పొందిన వారికి, వారి కుటుంబాలకు ఎల్లవేళలా సహాయ, సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఏ.సంజీవ రావ్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఇ.కళ్యాణి, కార్యాలయ సూపరింటెండెంట్ అశోక్, సీఐ లాలూ నాయక్, ఆర్ఐ రామారావ్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా న్యాల్‌కల్ మండలంలోని హద్నూర్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను, సిబ్బంది కోసం ఏర్పాటుచేసిన బ్యారక్‌లను పరిశీలించారు. అనంతరం స్టేషన్‌లోని పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ జక్కుల హన్మంతు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు వరం 'బువ్వ బండి'

- కాంగ్రెస్ నాయకుడు నీలం మధుముదిరాజ్


అమృత సత్తయ్య దంపతులను సన్మానిస్తున్న మధు

రామచంద్రాపురం, మే 31 (ఆంధ్రజ్యోతి) : పేదల ఆకలి తీర్చడానికి అమృత సత్తయ్య కొల్లూరి దంపతులు మూడేళ్లుగా నిర్వహిస్తున్న బువ్వబండి కార్యక్రమం సమాజానికి ఆదర్శనీయమని కాంగ్రెస్ నాయకుడు నీలం మధుముదిరాజ్ అన్నారు. శనివారం అమృత సత్తయ్య దంపతుల వివాహ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెల్లాపూర్‌లోని బువ్వబండి వేదిక వద్ద నిర్వహించారు. ఇందులో మధు పాల్గొని మాట్లాడుతూ వృద్ధాప్యంలో అమృత సత్తయ్య తమకు కలిగిన కొద్దిదాంట్లోనే పేదలకు ఇవ్వాలన్న ఆలోచన కలిగి ఉండటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుమార్, మాజీ కౌన్సిలర్ భరత్ పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి

- డీసీహెచ్ఎస్ సంగారెడ్డి

కల్హేర్, మే 31 (ఆంధ్రజ్యోతి) : వానాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాదుల పట్ల వైద్య, ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సంగారెడ్డి జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయకర్త(డీసీహెచ్ఎస్) సంగారెడ్డి సూచించారు. కల్హేర్‌లోని కమ్యూనిటీ ఆస్పత్రిని శనివారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో ఆస్పత్రి నిర్వహణ, సిబ్బంది పనితీరు పట్ల సమీక్ష నిర్వహించి, మాట్లాడారు. వచ్చేది వానాకాలం అయినందున గ్రామాల్లో ప్రబలే సీజనల్ వ్యాధులు డెంగీ, మలేరియా పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆస్పత్రిలో ఔట్ పేషెంట్స్ ఇన్ పేషెంట్స్‌కు అందుతున్న వైద్యం గురించి వైద్యులు అనిల్‌రెడ్డి, జేబా షమీమ్‌ను అడిగి తెలుసుకున్నారు. కల్హేర్‌లో 30 పడకల ఆస్పత్రి ఉన్నందున మరిన్ని ప్రసూతి కేసులు పెంచేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సిహెచ్.మాణిక్యం, సిబ్బంది శంకర్, పాండు తదితరులు పాల్గొన్నారు.

సిర్గాపూర్‌లో ఈజీఎస్ సమన్వయ సమావేశం

కల్హేర్, మే 31 (ఆంధ్రజ్యోతి) : సిర్గాపూర్ మండలంలో నాలుగవ విడత ఈజీఎస్ సామాజిక తనిఖీ జూన్ ఒకటి నుంచి నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా శనివారం దీనికి సంబంధించిన సమన్వయ సమావేశం సిర్గాపూర్ ఎంపీపీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మల్హార్‌నాయక్ సామాజిక తనిఖీలో చేపట్టబోయే అంశాలపై డీఆర్పీలకు సూచించారు.


లాభాల బాటలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు

- బ్యాంకు చైర్మన్ కె.ప్రతాప్‌రెడ్డి

నారాయణఖేడ్, మే 31 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ గ్రామీణ బ్యాంకు లాభాల బాటలో ప్రయాణిస్తుందని బ్యాంకు చైర్మన్ కె.ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం నారాయణఖేడ్ ప్రధాన శాఖను నూతన భవనంలోకి మార్చిన సందర్భంగా బ్యాంకును ప్రారంభించి మాట్లాడారు. గతంలో గ్రామీణ వికాస్ బ్యాంకు పేరిట ఉమ్మడి ఐదు జిల్లాలో సేవలందించే వారమని, ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా అన్ని వాణిజ్య బ్యాంకులకు ధీటుగా సేవలు అందిస్తున్నామన్నారు. తమ బ్యాంకులో కేంద్ర ప్రభుత్వం 50 శాతం వాటా, రాష్ట్ర ప్రభుత్వం 15 శాతం వాటా, ఎస్‌బీఐ 35 శాతం వాటాతో పూర్తి ప్రభుత్వ బ్యాంకు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 90 లక్షలమంది ఖాతాదారులతో 73,823.71 వేల కోట్ల వ్యాపారాన్ని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం సమత, చీఫ్ మేనేజర్ వినయ్‌కుమార్, బ్యాంకు ఇతర శాఖల మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా బ్యాంకు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఆయన వెంట డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతిఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు

- రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి


పీచేర్యాగడిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న గిరిధర్‌రెడ్డి

కోహీర్/జహీరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతిఒక్కరికీ విడతలవారీగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి అన్నారు. శనివారం కోహీర్ మండలంలోని పీచేర్యాగడి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. గూడు లేని ప్రతినిరుపేదను గుర్తించి వారికి తప్పనిసరిగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో జానకీరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రామలింగారెడ్డి, మాజీ సర్పంచ్ వీరారెడ్డి, ఎంపీడీవో భారతి, నాయకులు పాల్గొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లను అందజేస్తామని రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని అనెగుంట, మన్నాపూర్ గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల సర్టిఫికెట్లను అందజేశారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ళనిర్మాణం పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పీసీఈవో జానకీరెడ్డి, హౌజింగ్ డీఈఈ ఆంజయ్య ఎంపీడీవో మహేందర్‌రెడ్డి, నాయకులు, నాగిశెట్టి, మోయినొద్దీన్ పాల్గొన్నారు.

వైద్యులు ఫుల్.. రోగులు నిల్

5వ పేజీ తరువాయి

లేదా ఒప్పందంలో ఉన్న ప్రైవేటు ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు.

కళ తప్పిన దవాఖానా

రామచంద్రాపురం ఈఎస్ఐ ఆస్పత్రిలో 12 విభాగాలకు చెందిన 40 మంది ప్రత్యేక వైద్యులు సేవలందిస్తున్నారు. 80 మంది స్టాఫ్ నర్సులు, 70 మంది పారామెడికల్ సిబ్బంది పనిచేస్తున్నారు. ఎమర్జెన్సీలో ఇద్దరు వైద్యులు అందుబాటులో ఉంటారు. వీరందరికి చేసేందుకు పనిలేక రోగుల కోసం ఎదురుచూస్తున్నారు. నిత్యం ఓపీ 60 నుంచి 100 కూడా రావటం లేదు. వంద పడకలున్నా 30 పడకలు కూడా నిండటం లేదు. డిస్పెన్సరీలకు వచ్చే కేసులను ఎర్రగడ్డలో మల్టీస్పెషాలిటీ దవాఖానాకు లేదా రోగుల వినతిమేరకు ఒప్పందంలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రులకు రిఫర్ చేస్తుండటంతో స్థానికంగా ఉన్న ప్రత్యేక సేవలు ఉపయోగించుకునేవారు కరువయ్యారు. జనరల్ ఫిజీషియన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ, కంటి, ఛాతీ, చర్మ, చిన్నపిల్లలు, పేథాలజీ, రేడియాలజీ వంటి విభాగాలున్నా ప్రయోజనం లేకుండాపోతున్నది.

పేషెంట్లు ప్రైవేటుకే రాయమంటున్నారు

ఆస్పత్రిలో అన్ని స్పెషాలిటీల్లో సేవలు అందిస్తున్నాం. మందుల కొరత లేదు. ఎక్స్‌రే, సిటీస్కానింగ్, రక్తపరీక్షలు చేస్తున్నాం. రోగులకు ఎటువంటి ఇబ్బందులు రానివ్వకుండా చర్యలు తీసుకుంటున్నాం. కార్మికులు ఇక్కడ సేవలు పొందటం కంటే ఒప్పందంలో ఉన్న ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లడానికే మొగ్గుచూపుతున్నారు. రోగులు కోరడంతో ప్రైవేటు ఆసుపత్రులకు పంపాల్సి వస్తున్నది.

-సత్యనారాయణ, సూపరింటెండెంట్ రామచంద్రాపురం ఈఎస్ఐ

వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం

5వ పేజీ తరువాయి

మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో ఇసుక కొరత లేకుండా చూడాలని కోరారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ భూ భారతి చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రైతులు పండించిన ధాన్యం పూర్తిగా కొనుగోలు చేయాలని, వేసవి సెలవులు ముగిసే లోపు పాఠశాలలను పరిశుభ్రం చేయాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. సమావేశంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీం, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లు వల్లూరు క్రాంతి, రాహుల్‌రాజ్, మను చౌదరి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ సస్పెన్షన్

- జనరేటర్ ఆన్‌చేయడంలో ఆలస్యం చేసినందుకు..


సస్పెన్షన్‌కు గురైన శ్రీధర్‌కుమార్

జహీరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డా.శ్రీధర్‌కుమార్‌ను శనివారం ప్రభుత్వం సస్పెన్షన్‌కు గురిచేసింది. ఈ నెల 30న పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మొబైల్‌ఫోన్ టార్చిలైటుతో వైద్యం చేయడాన్ని తప్పు పడుతూ ఆయన సస్పెన్షన్‌కు గురిచేశారు.ప్రభుత్వాస్పత్రిలో కరెంటు పోయిన వెంటనే జనరేటర్‌ను ఆటోమెటిక్ ఆన్ అయ్యేలా ఏర్పాట్లు చేసుకోవడంలో అతను విఫలమైనందుకుగాను చర్యగా సస్పెన్షన్‌కు గురిచేస్తూ ప్రభుత్వం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పందించి సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు సేకరించి చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను ఆదేశించారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ శనివారం జహీరాబాద్ ప్రభుత్వఆస్పత్రికి వచ్చి క్షేత్రస్థాయిలో వాస్తవాలను గమనించి కలెక్టర్‌కు నివేదికను అందజేసినట్లు సమాచారం. ఓపక్క ఆస్పత్రి సూపరింటెండెంట్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం.. మరోవైపు జనరేటర్లు సిద్ధంగా ఉంచుకోకపోవడం తదితర కారణాలతో సస్పెన్షన్‌కు గురి చేశారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే ఎంతటివారినైనా వదిలే ప్రసక్తేలేదని కలెక్టర్ హెచ్చరించారు. ఈ విషయమై హరీశ్‌రావు స్పందించి ఆస్పత్రి లోపల విద్యుత్ పోతే టార్చ్‌తో పనిచేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

- హాజరైన ఎంపీ, ఎమ్మెల్యే, మాధవానందస్వామి

నర్సాపూర్, మే 31 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ మండలం గొల్లపల్లిలో నిర్మించిన రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనలు వైభవంగా నిర్వహించారు. పీఠాధిపతి మాధవానందస్వామి ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాధామల్లేశ్‌గౌడ్ దంపతులు యంత్ర ప్రతిష్ఠ, మూర్తిప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యే సునీతారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

బస్తీల్లో మౌలిక సదుపాయాలు : కార్పొరేటర్

రామచంద్రాపురం టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి) : బస్తీల్లో మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి అన్నారు. భారతీనగర్ డివిజన్ పరిధి ఈఎస్ఐ రోడ్‌లో ఏర్పాటు చేసిన స్ట్రీట్ లైట్లను శనివారం ప్రారంభించారు. అలానే దోమలనివారణకు ఫాగింగ్ కార్యక్రమం ప్రారంభించి మాట్లాడారు. బస్తీల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించేట్టు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో డీఈ లక్ష్మీప్రియ, ఏఈ తిరుపతి, సూపర్‌వైజర్ ఇజాజ్, బీఆర్ఎస్ నాయకులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్యలకు శాశ్వత పరిష్కారం

రామచంద్రాపురం టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి) : కాలనీల్లో ఏర్పడిన మురుగు సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ పుష్పానగేష్ అన్నారు. శనివారం రామచంద్రాపురం డివిజన్ పరిధి రామచంద్రారెడ్డినగర్‌కాలనీలో పర్యటించి మాట్లాడారు. రూ.50 లక్షలు మురుగు పారుదలకు ప్రత్యేకంగా పైపులైన్ నిర్మాణం చేపట్టడానికి అనుమతులు మంజూరయ్యాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపకమిషనర్ సురేష్, కాలనీవాసులు భుజంగ్‌రెడ్డి, వీరారెడ్డి, యాదయ్య, వాసుదేవ్, విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా అహల్యాబాయి జయంతి

జహీరాబాద్/నారాయణఖేడ్/కౌడిపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో విప్లవాత్మక భావసంచలనం సృష్టించి అందరి మన్ననలు పొందిన ఘనత అహల్యాబాయి హోల్కర్‌కే దక్కిందని ఎమ్మెల్సీ అంజిరెడ్డి పేర్కొన్నారు. శనివారం జహీరాబాద్‌లో బీజేపీ ఆధ్వర్యంలో అహల్యాబాయి 300వ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి పాల్గొన్నారు. నారాయణఖేడ్ పట్టణం జూక్కల్ శివారులోని హట్కర్ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు పండరినాయక్ ఆధ్వర్యంలో అహల్యాబాయి జయంతి నిర్వహించారు. కౌడిపల్లి మండలంలో బీజేపీ ఉపాధ్యక్షుడు ఖాజిపేట్ రాజేందర్ ఆధ్వర్యంలో సీహెచ్‌సీలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు.

'యోగాతో సంపూర్ణ ఆరోగ్యం'

అల్లాదుర్గం/చేగుంట, మే 31 (ఆంధ్రజ్యోతి) : యోగాతో ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఉంటారని డాక్టర్ రజని అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ దశాబ్ది వేడుకలను పురస్కరించుకుని శనివారం అల్లాదుర్గం మండలం ముప్పారం గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆధ్వర్యంలో యోగాపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌పీహెచ్ నిర్మల, స్థానికులు పాల్గొన్నారు. చేగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయుష్ ఆధ్వర్యంలో మెగా కోచ్ కర్రం శ్రీదేవి శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది, రోగులకు యోగాసనాలు చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయకుమార్ మాట్లాడారు.